

రెచ్చిపోతున్న కేటుగాళ్లు

సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు అడుగుతున్నారు.

- 8లో ▸



శునకం.. మర్కటం..

మాచారెడ్డి మండల కేంద్రంలో కుక్కలు, కోతులు రెచ్చిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /23.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'యోగాతో ఆరోగ్యం'



కామారెడ్డి అర్బన్: యోగా సాధనతో ఆరోగ్యం, ఆనందం, ఉన్నత వ్యక్తిత్వం అలవడుతాయని కార్మికశాఖ సహాయ కమిషనర్ కోటేశ్వరరావు పేర్కొన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో 25 రోజులుగా యోగా శిక్షకులకు కొనసాగుతున్న థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా యోగాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగా సర్టిఫికెట్ కోర్సుతో ప్రయోజనాలున్నాయన్నారు. యోగా శిక్షణను కొనసాగించాలని సూచించారు. పతంజలి యోగా సమితి ట్రస్ట్ చైర్మన్ ఆచార్య బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా యోగా భవన్ ఆవరణలో ఆయుర్వేద మొక్కలను నాటారు. కార్యక్రమంలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, యోగా టీచర్లు అనిల్‌రెడ్డి, గురుచరణ్, బాలరాజు, అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీరాజం, గంగారెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా నమోదుకు నేడు చివరి రోజు

కామారెడ్డి అర్బన్: రైతు బీమా కోసం సోమవారం సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. జూన్ 28లోపు కొత్తగా భూమిపాస్ బుక్ పొందిన 18 నుంచి 59 ఏళ్లలోపు రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లను సంబంధిత ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

25న జిల్లా స్థాయి యోగా పోటీలు

కామారెడ్డి అర్బన్: ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న యోగాసన జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి నివాస్ పటేల్ తెలిపారు. జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికలు, పురుషులు, మహిళల విభాగాలలో 8–50 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యోగా పోటీల్లో ఓంకారం, ఏదైనా శ్లోకం, సూర్యనమస్కారాలు, ఏవేని మూడు ఆసనాలు, ప్రాణాయామం, ముద్ర తదితర అంశాలుంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 83338 55845 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డెంగీతో చిన్నారి మృతి



బాన్సువాడ/బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన ధనుశ్రీ అనే ఏడేళ్ల చిన్నారి డెంగీతో మరణించింది. వివరాలిలా ఉన్నాయి. ధనుశ్రీ బాన్సువాడలోని ప్రైవేట్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. ఆమె ఐదు రోజుల క్రితం డెంగీ బారిన పడింది. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది.

సోలార్ జాడేది?

విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం(ఐడీవోసీ)లో చేపట్టిన సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఖమ్మం జిల్లాలో పనులు పూర్తై విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైనా.. కామారెడ్డిలో మాత్రం పనులే మొదలు కాలేదు. దీంతో విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడానికి అధికారులు పొదుపు మంత్రం పాటించాల్సి వస్తోంది.



కామారెడ్డి కలెక్టరేట్

- ఐడీవోసీలో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయం
- వంద కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం..
- నెలలు గడుస్తున్నా మొదలుకాని పనులు
- కలెక్టరేట్‌కు తప్పని బిల్లుల భారం
- పొదుపు చర్యలు పాటిస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం రెన్యువబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తోంది. ఇళ్లలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం సబ్సిడీలనూ అందిస్తోంది. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను ఆదాచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సైతం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయాల (ఐడీవోసీ)లో సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించి ఖమ్మం, కామారెడ్డి జిల్లాలను ఎంపిక చేసింది. కామారెడ్డి కలెక్టరేట్‌లో వాహనాల పార్కింగ్‌తోపాటు విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ షెడ్ నిర్మాణానికి రూ. 95 లక్షలు మంజూరు చేసింది. సోలార్ షెడ్ నిర్మాణానికి గతేడాది అక్టోబర్ 9న శంకుస్థాపన చేశారు. రెడ్‌కో ఆధ్వర్యంలో పనులు చేపట్టాల్సి ఉంది.



సోలార్ షెడ్ కోసం వేసిన శిలాఫలకం

భారంగా మారిన విద్యుత్ చార్జీలు..

కలెక్టరేట్‌కు విద్యుత్ చార్జీలు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో అధికారులు పొదుపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇటీవల లిఫ్టులను ఆపేస్తున్నారు. దీంతో మహిళా ఉద్యోగులతోపాటు మోకాళ్ల నొప్పులు ఉన్న అధికారులు, సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సాయంత్రం ఉద్యోగులు ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత విద్యుత్ లైట్లను పూర్తిగా ఆఫ్ చేస్తున్నారు. దీంతో కలెక్టరేట్ రాత్రి వేళలో అంధకారంలో మునిగిపోతోంది. వేసవి కాలంలో ఎండలు మండిపోవడంతో కలెక్టరేట్‌లో అన్ని కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఎక్కువగా వినియోగించారు. ముఖ్యంగా పైఅంతస్తుల్లో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కార్యాలయానికి వచ్చిన నుంచి తిరిగి ఇంటికి వెళ్లేదాకా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు తిరిగాయి. దీంతో బిల్లులు అడ్డగోలుగా వచ్చాయి. బిల్లుల భారం తగ్గించుకునేందుకు అధికారులు పొదుపు చర్యల్లో భాగంగా లిఫ్టులను ఆపేయడం, రాత్రి పూట కలెక్టరేట్‌కు లైట్లను ఆర్పివేయడం వంటివి చేస్తున్నారని తెలుస్తోంది. సోలార్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఉంటే కార్యాలయానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి జరగడంతో పాటు అదనపు విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు అమ్ముకోవడానికీ ఆస్కారం ఉండేదని, వాహనాల పార్కింగ్ సమస్యా పరిష్కారమయ్యేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తొమ్మిది నెలలు గడిచినా..

కామారెడ్డి కలెక్టరేట్ వెనకభాగంలో 100 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడానికి షెడ్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. వాహనాలను పార్కింగ్ చేయడానికి షెడ్లు ఉపయోగపడేలా ప్లాన్ చేశారు. రెండు రకాల ప్రయోజనాలతో సోలార్ షెడ్ల నిర్మాణాలు చేపట్టి, వంద కిలోవాట్ల విద్యుత్ ప్లాంట్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. దీని నిర్మాణం పూర్తయితే కలెక్టరేట్ భవనానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీంతో కలెక్టరేట్‌కు సంబంధించి ప్రతి నెలా రూ. 50 వేలపైచిలుకు విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి కలగడంతో పాటు వాహనాల పార్కింగ్ కష్టాలు తీరేవి. అయితే శంకుస్థాపన చేసిన తొమ్మిది నెలలు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. సోలార్ షెడ్ల కోసం అవసరమైన సామగ్రిని తెప్పించేందుకు నిధులు లేకపోవడంతో పనులు చేపట్టలేదని తెలుస్తోంది.



ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ షెడ్లు

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సాంబశివరావు

ఖలీల్‌వాడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు, ఏఐటీయూసీ అభినందన సభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లతో పేదలకు పూర్తిగా లబ్ధి చేకూరడం లేదన్నారు. పేదలకు నేరుగా లబ్ధి జరిగేలా పథకాలు ప్రవేశ పెట్టాలన్నారు. మోదీ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రూ.లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేసిందని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో చూపించాలన్నారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో బూతులు తిట్టుకుంటూ, సహనం కోల్పోయి ఒకరినొకరు నిందించుకోవడం ఎక్కువైందన్నారు. ఇలా చేస్తున్న ఎమ్మెల్యేలపై వేటువేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల సమస్యలు అలాగే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అంజదేశారు. అంతకుముందు జిల్లా నాయకులు కూనంనేని సాంబశివరావును సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు సాయిలు, విఠల్‌గౌడ్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల కార్యకర్తలే నా వారసులు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): తన తర్వాత తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తర్వాత క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్తలే తనకు రాజకీయ వారసులుగా ఉంటారన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారికి తన మద్దతు ఉండాలంటే పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. వ్యసనపరులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని తాను ప్రోత్సహించనని తేల్చిచెప్పారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థి విభాగాలను బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని యూత్ కాంగ్రెస్ నేతలకు సూచించారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రభుత్వం కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకురాబోతోందని, దీంతో పోడు భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. పోడు భూముల పట్టాల కోసం రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన తండాలతో పాటు మారుమూల గ్రామాల రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు కలిసి విజయవంతం చేయాలని సూచించారు.



జుక్కల్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

తరగతులు ప్రారంభమయ్యేనా?

- కొత్త కళాశాలల్లో పూర్తయిన ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ
- అధ్యాపకుల జాడ కరువు
- ఇప్పటికీ ప్రారంభం కాని తరగతులు
- ఆందోళన చెందుతున్న ఇంటర్ విద్యార్థులు
- పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు



నిజాంసాగర్‌లో ఇంటర్ అడ్మిషన్లు స్వీకరిస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి. నిజాంసాగర్, నాగిరెడ్డిపేట, బీబీపేట మండలాలకు గతేడాది ప్రభుత్వం కొత్తగా జూనియర్ కళాశాలలను మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త జూనియర్ కళాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడంతో ఇంటర్ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తైనా తరగతుల జాడ లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతుల నిర్వహణ ఏర్పాట్లు చేశారు. ఆ పాఠశాల ఆవరణలో జూనియర్ కళాశాల ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అడ్మిషన్లు స్వీకరించారు. జూనియర్ కళాశాల నిర్వహణకు గాను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు గదులతో పాటు పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని ఎంపిక చేశారు. పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇంటర్ ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించే బాధ్యతను సిబ్బందికి అగించారు. అయితే గ్రామాల వారీగా తిరుగుతూ 20 మంది విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి కళాశాలలో చేర్పించారు.



విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన ఇంటర్ పాఠ్యపుస్తకాలు

మూలుగుతున్న పాఠ్య పుస్తకాలు, ల్యాబ్ మెటీరియల్

గతేడాది నిజాంసాగర్ మండలానికి కళాశాల మంజూరు చేయడంతో పాటు రూ.లక్ష విలువ చేసే ల్యాబ్ మెటీరియల్, పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. నిజాంసాగర్ కళాశాల ప్రారంభం కాకపోవడంతో పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ మెటీరియల్‌తో పాటు పుస్తకాలు వృథాగా పడి ఉన్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా.. నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంటర్ అడ్మిషన్లపై దృష్టి పెట్టిన అధికారులు తరగతుల నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. లెక్చరర్లను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

❝ అధ్యాపకులు లేరు



కొత్తగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో సంతోష పడ్డాం. నిజాంసాగర్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ అయినా క్లాసులు నడుస్తాయా లేదా అను మానం ఉంది. కళాశాలకు సంబంధించిన అధ్యాపకులు లేకపోవడంతో తరగతులు ఎప్పుడు ప్రారంభిస్తారని సందేహం ఉంది.

– శిరీష, సీఈసీ విద్యార్థిని, నిజాంసాగర్

గదులు కూడా లేవు




నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహించడం లేదు. కళాశాలలో గదులు లేవు, సార్లూ లేరు. ప్రభుత్వం స్పందించి, కళాశాలకు అవసరమైన వసతులు కల్పించాలి. అధ్యాపకులను నియమించి తరగతులు జరిగేలా చూడాలి.


– దశరథ్, ఇంటర్ విద్యార్థి

నేడు డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక


- పదవి కోసం తీవ్ర పోటీ
- కామారెడ్డి జిల్లాకు దక్కే అవకాశం
- ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న ఇంద్రసేనారెడ్డి



ఇంద్రసేనారెడ్డి



తారాచంద్



డీసీఎంఎస్ కార్యాలయం

సుభాష్‌నగర్: ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్ పదవి కామారెడ్డి జిల్లాకే దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న ఇంద్రసేనారెడ్డి (బీబీపేట్ సొసైటీ చైర్మన్)తోపాటు రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ మధ్య చైర్మన్ పదవి కోసం తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చైర్మన్‌గా ఉన్న సాంబారు మోహన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం పూర్తిస్థాయి చైర్మన్ పదవి కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ పాలకవర్గం 2020 ఫిబ్రవరిలో ఎన్నికైంది. ఇందులో మొత్తం 10 మంది డైరెక్టర్లు (ఆరుగురు సొసైటీ చైర్మన్లు, నలుగురు బీ కేటగిరీలో) ఉంటారు. సాంబారు మోహన్ నల్లవెల్లి చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఆయన డీసీఎంఎస్ డైరెక్టర్‌గా అనర్హులయ్యాడు. ఐదుగురు సొసైటీ చైర్మన్లు ఉండగా, బీ కేటగిరీ నలుగురిలో ఇద్దరు అనర్హులు. ఏడుగురిలో ఆరుగురు కాంగ్రెస్‌కు చెందిన వారు, తాడ్వాయి సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి ఒక్కరే బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆరుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ నేతృత్వంలో క్యాంపులో కొనసాగుతున్నారని తెలిసింది. కాగా అదే జిల్లా నుంచి సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుంటే గాంధారి సొసైటీ చైర్మన్ సాయికుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ పాలకవర్గం గడువు మరో ఆరు నెలలు మాత్రమే ఉంది.

ఆనవాయితీ ప్రకారం..

డీసీసీబీ, డీసీఎంఎస్ పదవులు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్నాయి. డీసీసీబీ ఒక జిల్లాకు, డీసీఎంఎస్ మరో జిల్లాకు కేటాయించడం పదేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన కుంట రమేశ్ రెడ్డి కొనసాగుతున్నారు. డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి ఏప్రిల్ 19న బాధ్యతలు స్వీకరించారు. డీసీఎంఎస్ కామారెడ్డి జిల్లాకు కేటాయించాలని ఆ జిల్లా నుంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఆ జిల్లాకు చెందిన నేతకే చైర్మన్ పదవి ఇచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పట్టుబడుతున్నారు. నిజామాబాద్ నుంచి అమ్రాద్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి.

ఎన్నికల అధికారిగా రామ్మోహన్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఉదయం 9 గంటల తర్వాత చైర్మన్ ఎన్నిక ప్రక్రియ మొదలు కానుంది. ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ రామ్మోహన్ వ్యవహరిస్తారు. సింగిల్ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పిస్తే నిబంధనల ప్రకారం ఎన్నికల అధికారి చైర్మన్ పేరు అధికారికంగా ప్రకటిస్తారు. ఒకవేళ రెండు నామినేషన్లు దాఖలైతే చేతులెత్తే విధానంలో ఎన్నిక ఉంటుంది.


శుభకార్యాలకు వేళాయె!

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- మూడు నెలల తర్వాత శుభ ముహూర్తాలు

నాగిరెడ్డిపేట: శుభకార్యాలకు వేళయ్యింది. సుమారు మూడు నెలల తర్వాత పెళ్లి భాజాలు మోగే సమయం ఆసన్నమైంది. సోమవారంనుంచి శ్రావణ మాసం ప్రారంభం అవుతుండడంతో నెలంతా శుభ కార్యాలతో సందడి కొనసాగనుంది. మూఢం కారణంగా మూడు నెలలుగా శుభ ముహూర్తాలు లేవు. దీంతో వివాహాలు, గృహప్రవేశాలు లేకపోవడంతో ఫంక్షన్ హాల్స్ బోసిపోయాయి. సోమవారంనుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుండడంతో మళ్లీ శుభకార్యాల నిర్వహణ కోసం ఫంక్షన్‌హాల్స్ సిద్ధమయ్యాయి. ఈనెలాఖరు వరకే శుభ ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు చెబుతున్నారు. భాద్రపదంలో శుభ ముహూర్తాలు ఉండవని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నెలంతా పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, నూతన వస్త్రాలంకరణ తదితర శుభ కార్యాలు జోరుగా జరుగనున్నాయి.

జోరందుకోనున్న వ్యాపారాలు...

శ్రావణ మాసం ప్రారంభం కావడంతో వ్యాపారాలు జోరందుకోనున్నాయి. ప్రధానంగా బంగారం, వస్త్ర దుకాణాలతోపాటు ఇతర దుకాణాలు కిటకిటలాడనున్నాయి. దీంతోపాటు ఫంక్షన్ హాల్స్, బ్యాండుమేళాలు, డెకరేషన్, క్యాటరింగ్, ట్రావెల్స్, ఫొటో, వీడియోగ్రాఫర్లకు గిరాకీ లభించనుంది.



❝ మళ్లీ బిజీ..

మూడు నెలలపాటు శుభ ముహూర్తాలు లేకపోవడంతో మాకు పనులు లేకుండా పోయాయి. శ్రావణమాసం ప్రారంభమవుతుండడంతో మళ్లీ గిరాకీ లభించనుంది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలతోపాటు ఇతరత్రా శుభకార్యాలతో నెలరోజులు బిజీగా మారనున్నాం.

– వినోద్, విన్నీ ఈవెంట్స్, గోపాల్‌పేట

మూడు నెలల తర్వాత..

మూఢంతో మూడు నెలలపాటు శుభ కార్యాలు నిలిచిపోయాయి. సోమవారం నుంచి శ్రావణం ప్రారంభమవుతుంది. ఈనెల 8, 9, 10, 11, 15, 18, 22, 23, 28 తేదీల్లో వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. మళ్లీ భాద్రపదంతో ముహూర్తాలు ఉండవు.

– జయరాం శర్మ, పురోహితుడు, లచ్చపేట

క్లుప్తంగా

రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని సక్సెస్ చేయాలి



దోమకొండ : రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విద్యాపరిషత్ ట్రస్ట్ కామారెడ్డి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3 న జిల్లా కేంద్రంలో నిర్వహించే రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దోమకొండ రెడ్డి సంఘ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి జన సమీకరణపై చర్చించారు. పార్టీలకతీతంగా రెడ్డి కులస్తులంతా కలిసి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు సిద్దారెడ్డి, సభ్యులు రామ్మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, నర్సారెడ్డి, మన్నె మల్లారెడ్డి, భీం రెడ్డి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బృందం సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సామాజిక తనిఖీ బృందంతో సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీవో మధు తెలిపారు. అన్ని గ్రామాలకు కేటాయించిన సోషల్ ఆడిటర్‌లకు పలు సూచనలు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సాగుతున్న నాగన్నగారి బావి అభివృద్ధి పనులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని నాగన్నగారి బావి వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే గత కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసిస్ సంస్థ మెట్ల బావికి మరమ్మతులు చేసి పూర్వవైభవం తీసుకొచ్చారు. దీంతో బావికి ఆధునీకరణ సంతరించుకొని పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల వచ్చిన కొత్త కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మెట్ల బావి పైభాగంలో మరికొన్ని అభివృద్ధి పనులు చేయాలని ఆదేశించారు. బావి చుట్టూ స్టెంచి వేసి మొరంతో చదును చేయాలని ఆదేశించారు. అలాగే కామారెడ్డి ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డు నుంచి ఫార్మేషన్ రోడ్డు, బావికి నాలుగు వైపులా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే బావి చుట్టూ మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు పనులు వేగవంతం చేశారు. త్వరలో నాగన్నగారి మెట్ల బావి పర్యాటకులను కనువిందు చేయనుంది.

ట్రాక్టరెక్కిన శునకం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భైరవ అనే పేరుతో, గ్రామ సింహం అనే మరో పేరు కలిగిన కుక్కలు విశ్వాసంగా కాపలా ఉంటాయి. ఇందల్వాయి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఒంటరి సంతోష్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో తాను పెంచుకునే కుక్క ట్రాక్టర్ మీద రాయల్‌గా కూర్చున్న, నిద్రించిన చిత్రాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

పాఠశాలల్లో పారిశుధ్య పనులేవి..?

- 2021లో స్కావెంజర్ వ్యవస్థ రద్దు
- పంచాయతీలకు బాధ్యతల అప్పగింత
- సిబ్బంది కొరతతో పట్టించుకోని జీపీలు
- పాఠశాలలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం



సిద్దాపూర్ పాఠశాలలో పారిశుధ్య పనులు చేపడుతున్న మహిళ(ఫైల్)

రాజంపేట : సర్కారు బడుల్లో స్వీపర్ల కొరత వేధిస్తోంది. దీంతో పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. 2021 స్కావెంజర్ల వ్యవస్థ రద్దు చేసి ఆ బాధ్యతలను పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం అప్పగించింది. గ్రామ పంచాయతీల్లో జీతాలు సవ్యంగా చెల్లించకపోవడంతో సొంతగా డబ్బులు వెచ్చించి ఉపాధ్యాయులే స్వీపర్లను నియమించుకుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే పారిశుధ్య పనులు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.

కామారెడ్డి జిల్లాలో 698 ప్రాథమిక, 127 ప్రాథమికోన్నత, 215 ఉన్నత పాఠశాలలున్నాయి. దాదాపు 90 శాతం పాఠశాలల్లో స్వీపర్లు లేరు. దీంతో 2016లో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్లను నియమించారు. అటెండర్, స్వీపర్ లేని పాఠశాలకు ఒక స్కావెంజర్, నైట్ వాచ్‌మన్ పోస్టులు మంజూరు చేశారు. వీరికి మొదట్లో నెలకు రూ.3 వేల జీతం ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సంఖ్యను బట్టి దాన్ని రూ.2,500లకు కుదించారు. ప్రాథమిక పాఠశాలలో రూ.2,000 ఇచ్చారు. 2021 సెప్టెంబర్ నుంచి స్కావెంజర్ వ్యవస్థను రద్దు చేశారు. ఈ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీలో ఉన్న పారిశుధ్య కార్మికులకు అప్పగించారు. జనవరి 31న సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో, అప్పటి నుంచి పంచాయతీలకు నిధుల వరద ఆగిపోయింది. దీంతో పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు కూడా స్కావెంజర్లకు ఇచ్చే నగదు సుమారు ఏడాది కాలం నుంచి నిలిచినట్లు స్థానిక పాఠశాలల హెచ్‌ఎంలు చెబుతున్నారు.

విద్యార్థులే స్వీపర్లుగా..?

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీలకు సరిపోయే నిధులు రాక, కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు ఇటు పంచాయతీలో అటు పాఠశాలలో పారిశుధ్య విధులు నిర్వహించడానికి ముందుకు రావడం లేదు. ముఖ్యంగా చిన్నపాటి గిరిజన తండాల్లోని స్కూళ్లలో ఈ సమస్య మరింత జఠిలంగా మారింది. కొన్ని చోట్ల సమీప ఇళ్లలోని మహిళలు, మధ్యాహ్న భోజన కార్మికుల సాయంతో టీచర్లు పాఠశాల పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. వారు సహకరించని పరిస్థితిలో విద్యార్థులే ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో టీచర్లు ఎస్ఎంసీ నిధుల నుంచి సొంత డబ్బులతో కార్మికులను నియమించుకుంటున్నారు. అయితే ఇటీవల పంచాయతీలకు కొంత మొత్తం కార్మికులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతో పంచాయతీ కార్మికులకు కాస్త ఉపశమనం కలగనుంది. కానీ పాఠశాలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తారా లేదా అనేది సందిగ్ధత నెలకొంది.

వెంటనే చేపట్టాలి



పాఠశాలలో స్కావెంజర్లను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి. ఈ విద్యాసంవత్సరంలో ఒక్కసారి కూడా గ్రామ పంచాయతీ సిబ్బంది మా పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టలేదు. పాఠశాలకు ప్రత్యేక స్కావెంజర్‌లను ప్రభుత్వం కేటాయిస్తే అటు జీపీ సిబ్బందికి ఇటు పాఠశాలల్లో పారిశుధ్య పనులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– డీ ఈశ్వర్, కాంప్లెక్స్ హెచ్ఎం రాజంపేట

వృథాగా మిషన్ భగీరథ నీళ్లు



చావుని తండా ప్రాథమిక పాఠశాల సమీపంలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీటిని అరికట్టాలని తండావాసులు కోరుతున్నారు. మండలంలోని చావుని తండా ప్రాథమిక పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ నీరు వృథా పోతోంది. దీనిపై తండావాసులు పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి, మిషన్ భగీరథ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవట్లేదని వారంటున్నారు. తండాలో పలు కాలనీలకు మంచినీటి సరఫరా లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని వారు పేర్కొంటున్నారు.

హాకీ సౌత్‌జోన్ కోచింగ్ క్యాంప్‌నకు ఎంపిక



మనోజ్ ,అక్షయ

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ కోచింగ్ క్యాంప్‌నకు ఎంపికయ్యారు. గత నెల 10 నుంచి 17వ తేదీ వరకు కడపలో నిర్వహించిన సౌత్ జోన్ మెన్ అండ్ వుమెన్ హాకీ పోటీల్లో ఏడు రాష్ట్రాలు పాల్గొన్నాయి. అందులో తెలంగాణ నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు హగ్గ మనోజ్, కంచర్ల అక్షయను ఈనెల 13 నుంచి 24వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించే సౌత్ జోన్ మెన్ అండ్ వుమెన్ హాకీ కోచింగ్ క్యాంపునకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, జిల్లా అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సారూ.. మంచినీళ్లివ్వండి..!

- మోడల్ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు నీటిగోస

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని మోడల్ కళాశాల వసతి గృహంలో మంచి నీళ్ల గోస మొదలైంది. వసతి గృహంలో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్ చెడిపోయి నెలలు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు విద్యార్థినులు పేర్కొంటున్నారు. నాలుగు రోజులుగా భగీరథ నీరు కూడా సక్రమంగా సరఫరా కావట్లేదని వారు వాపోతున్నారు. తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. వసతి గృహం ఇన్‌చార్జీగా రామారెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు ఇవ్వడంతో ఆమె సక్రమంగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. వసతి గృహంలో వార్డెన్‌గా బాధ్యలు చేపడుతున్న ఉద్యోగుల కూడా తమ కష్టాలను పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి తాగునీటి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నారు.

రాళ్లవాగు వద్ద పర్యాటకుల సందడి



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ రాళ్లవాగు ప్రాజెక్ట్ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడంతో ప్రాజెక్ట్ జలాశయం నిండింది. దీంతో ప్రాజెక్ట్ మత్తడిపై నుంచి వరద దూకుతోంది. ఈ దృశ్యాన్ని వీక్షించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మత్తడి పైనుంచి నీరు దూకుతుండడంతో పర్యాటకులు స్నానాలు చేస్తూ సందడి చేశారు.

చిన్నమల్లారెడ్డిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

కామారెడ్డి క్రైం : భూ తగాదాల నేపథ్యంలో రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి (45) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి వ్యవసాయ క్షేత్రం వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. తనకు వారసత్వంగా సంక్రమించిన, సాగు చేసుకుంటున్న భూమిని తన పెదనాన్న సత్యంరెడ్డి పట్టా చేసి ఇవ్వడం లేదనే మనస్థాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విచారణ జరిపిన రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు. సదరు భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులంతా ఒక్కటై డిమాండ్ చేస్తున్నారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగేదాకా అంత్యక్రియలు నిర్వహించేది లేదని మృతదేహాన్ని పోస్టుమార్టం గది వద్దే ఉంచి గ్రామంలోని సత్యంరెడ్డి ఇంటి వద్ద ఆదివారం కూడా ఆందోళనలు చేశారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పట్టణ, రూరల్ సీఐలు, పలువురు ఎస్సైలు, 50 మంది వరకు సిబ్బందితో కలిసి గ్రామంలో ఆదివారం బందోబస్తు చేపట్టారు. పోలీసులు, గ్రామ పెద్దలు ఇరువర్గాలతో చర్చిస్తున్నారు. సోమవారం వరకల్లా వివాదం సర్దుబాటు కావచ్చని భావిస్తున్నారు.

క్రైం కార్నర్

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మాక్లూర్: మండలంలోని రాంచంద్రాపల్లికి చెందిన శిరసు వెంకట్(52) బతుకుదెరువు నిమిత్తం మలేషియాకు వెళ్లగా అక్కడ గుండెపోటుకు గురై మృతి చెందగా మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. పేద కుటుంబం కావడంతో స్థానిక యువకులు విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని మలేషియా నుంచి రప్పించేందుకు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎంతో కృషి చేశారని యువకులు తెలిపారు. అంత్యక్రియల్లో బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూర్ గిరీష్, రాష్ట్ర ఎస్టీ మోర్చా కార్యదర్శి తొడు మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలోని మాధవ్‌నగర్ బైపాస్ రోడ్డు సమీపంలో ఓ ఇంటి వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. డిచ్పల్లి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 6,990 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, లక్ష్మన్న, కానిస్టేబుల్ రాములు, సుధాకర్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఏడు తులాల బంగారం అపహరణ
- ముప్కాల్ మండలం రెంజర్లలో ఘటన

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్లలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి ఏడు తులలాల బంగారాన్ని దొంగిలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకాం.. గ్రామానికి చెందిన ఏర్గట్ల రాజశేఖర్ హైదరాబాద్‌లో ఉంటుండగా ఆ ఇంట్లో అతని తల్లితండ్రులు ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వారు ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం ఉన్న విషయాన్ని గ్రహించిన దుండగులు రాత్రి ఇంట్లోకి చొరబడి బెడ్ రూంలో ఉన్న బీరువా నుంచి రెండు బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన తల్లితండ్రులు ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీంతో వేలి ముద్రాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

15రోజుల్లో మూడు ఘటనలు

గత పదిహేను రోజుల్లో మూడు ఘటనలు తాళం వేసిన ఇంట్లోనే జరిగాయి. బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో గత నెల 19న, ముప్కాల్ మండల కేంద్రంలో గతనెల 22న దొంగతనాలు జరిగాయి. వాటిలో చోరీకి పాల్పడింది మహారాష్ట్రకు చెందిన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు మహారాష్ట్రకు వెళ్లినట్లు తెలిసింది. అంతలోనే రెంజర్లలో మరో చోరీ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వైఫల్యం వల్లే దొంగతనలు వరుస దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు



తాడ్కోల్ శివారులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

బాన్సువాడ రూరల్: మండలంలోని వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను కొందరు దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. ఈనెల 1న తాడ్కోల్ శివారులో ఏనుగంటి నాగేశ్వరరావు తన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్‌వైర్లను దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఈనెల 3న తన పంటపొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దుండగులు కాపర్ వైర్లు దొంగిలించారని బోర్లంకు చెందిన మంద నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరుసగా జరుగుతున్న ఘటనలతో దుండుగులు తమపై ఏ అఘాయిత్యాలకు పాల్పడుతారోనని రైతులు జంకుతున్నారు. పోలీసులు దొంగల ముఠాను పట్టుకుని రైతుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాణాకలాన్‌లో..

ఎడపల్లి: మండలంలోని తానాకాలన్ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగిలించారు. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఉదయం తన పొలానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



భిక్కనూరులో 1993-94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

భిక్కనూరు : ఐదేళ్ల కాదు..పదేళ్ల కాదు.. ఏకంగా 30 ఏళ్ల తర్వాత భిక్కనూరు మండల కేంద్రంలోని బాలుర బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక ఎస్వీ గార్డెన్స్‌లో ఆదివారం సమావేశమయ్యారు. 92 మంది విద్యార్థులకు గాను 85 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు.

మా సార్లను చూసే టీచర్ అయ్యాను



ఆనాడు మాకు చదువుచున్న టీచర్లందరిని ఆదర్శంగా తీసుకుని నేను ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నాను. ఈ వృత్తిలో ఉన్న సంతృప్తి మరే ఇతర వృత్తులో ఉండదని గుర్తించాను. ఇప్పటికీ నేను ఆనాడు నాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నాను. – అనురాధ, ప్రభుత్వ టీచర్

సుదీర్ఘ నిరీక్షణ..



ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నెల రోజుల క్రితం క్లాస్ మేట్స్ ఫోన్‌లో సమాచారం అందించారు. అప్పటి నుంచి ఈరోజు కోసం ఎదురు చూశాను. 30 ఏళ్ల తర్వాత క్లాస్‌మేట్స్‌ను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. – మంజుల,దోమకొండ



సమ్మేళనంలో పాల్గొన్న నియో ప్రగతి పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న దోమకొండ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

దోమకొండ/కామారెడ్డి క్రైం/బాల్కొండ/బాన్సువాడ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. దోమకొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1992-93, కామారెడ్డిలోని నియో ప్రగతి హైస్కూల్‌కు చెందిన 1998-99, ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09, బాన్సువాడలోని వివేకానంద విద్యాలయంలో 1999-2000కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.






రెంజర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, వివేకానంద విద్యాలయ పూర్వ విద్యార్థులు

రెచ్చిపోతున్న కేటుగాళ్లు

- పోలీసుల పేరుతో కొనసాగుతున్న ఫేక్ కాల్స్
- పాకిస్తాన్ కోడ్‌తో వాట్సాప్ కాల్స్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



కిషన్‌గౌడ్‌కు వచ్చిన ఫేక్ కాల్ (ఫైల్)

మోర్తాడ్: కష్టపడకుండా భారీ మొత్తంలో డబ్బులు రావాలి.. అంటే మోసాలకు పాల్పడాలి అని అనుకుంటూ కొందరు కేటుగాళ్లు సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారు. అయితే ఇప్ప టి వరకు వాట్సాప్ ఖాతాదారుల డేటాను సేకరించి, డేటా సంబంధిత ఖాతాదారులను బెదిరించి నగదు వసూలు చేయడం, అలానే ఏదో ఒక లింక్‌ను వినియోగదారులకు పంపించి వారు ఆ లింక్ క్లిక్ చేసేలా ప్రలోభాలకు గురిచేసి, వాళ్లు ఆ లింక్‌ను క్లిక్ చేయగానే వాళ్ల బ్యాంక్ అకౌంట్‌లోని డబ్బులును కాజేయడం చూసాము.

అయితే ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. మోసం చేయడంలో ఆరితేరిన కేటుగాళ్లు మీ అబ్బాయి డ్రగ్‌కేసులో దొరికాడని, మీ అమ్మాయిని కిడ్నాప్ చేశామని, మా స్నేహితుడి చెల్లెకు మీ కుమారుడు అసభ్యకరంగా మెసేజ్ చేశాడని ఇలా మీ మీద కేసు లేకుండా చేయాలన్నా, మీ పిల్లలు మీకు దక్కాలన్నా మేము అడిగిన డబ్బు ఇవ్వాల్సిందేనంటు బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిని కొందరు సైబర్‌నేరమని ముందుగానే గుర్తించి వాటి నుంచి తప్పించుకుంటున్నారు.

తాజాగా.. కమ్మర్‌పల్లి మండలంలోని ఓ వ్యాపారికి ఫోన్ చేసిన సైబర్ నేరస్తుడు నీ కుమార్తె డ్రగ్స్ కేసులో ఇరుక్కుందని కేసు నమోదు చేస్తే ఆమె భవిష్యత్తు చెడిపోతుందని వాట్సాప్ కాల్‌లో వెల్లడించాడు. ఇది ఫేక్ అని గుర్తించిన సదరు వ్యాపారి సరే మాకు ఏది జరగాలో అది జరుగుతుందని మీరు సానుభూతి చూపించాల్సిన అవసరం లేదని మాట్లాడి పెట్టేశాడు. ఇలా దినమంతా వాట్సాప్ కాల్స్ వస్తూనే ఉండటంతో అతను వెంటనే సైబర్ నేరస్తుని నంబర్‌ను బ్లాక్ చేశాడు. అయినా మరో నంబర్‌తో కాల్ చేస్తూనే ఉన్నాడు. వ్యాపారితో మాట్లాడిన సమయంలో అతని కుమార్తె పేరు, ఇతర వివరాలు పక్కాగా చెప్పాడు. అయినా ఆ వ్యాపారి ఆందోళన చెందకుండా ఉండటంతో ఎలాంటి మోసానికి గురికాలేదు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన దూలూరు కిషన్ గౌడ్‌కు పోలీసు అధికారి ఫొటో డీపీతో ఉన్న ఓ పాకిస్తాన్ నంబర్‌తో కాల్ వచ్చింది. వాట్సాప్ కాల్ కావడం ఇప్పటికే ఈ ఫేక్ కాల్స్ గురించి అవగాహన ఉండటంతో కిషన్ గౌడ్ ఫోన్ ఎత్తలేదు. అలాగే రామన్నపేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జాగీరపు మోహన్‌రెడ్డికి రెండు రోజులుగా ఒకే నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వస్తూనే ఉంది. వాట్సాప్ కాల్ చేసింది సైబర్ కేటుగాడు అని గుర్తించిన మోహన్‌రెడ్డి అగంతకునికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా హిందీలో ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో కొన్ని క్షణాల్లోనే ఫోన్ పెట్టేశాడు. ఇలా ప్రతిసారి ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురికి ఫేక్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఎక్కువ మందికి +923260 కోడ్‌తోనే ఫేక్ కాల్స్ వస్తున్నాయని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా కాల్స్ చేస్తున్న అగంతుకులు మాత్రం తాము ఎవరికి కాల్ చేస్తే వారి కుటుంబ సభ్యుల పేర్లు మాత్రం పక్కాగా చెబుతున్నారు. దీంతో అనేక మంది ఆందోళనకు గురవుతున్నారు. సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

'సాగర్'లో చేపల వేట



నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపలను వేటాడుతున్న పర్యాటకులు

నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించడానికి ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. గుల్‌దస్తా ప్రాంతంలోని 12 గేట్ల వద్ద ప్రాజెక్టులో పలువురు యువకులు గాలాలతో చేపలు పట్టారు. – నిజాంసాగర్

హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి



షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందిస్తున్న సుభాష్ జాదవ్

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ప్రభుత్వ మహిళ వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్‌జాదవ్ కోరారు. ఈమేరకు ఆదివారం ఆయన నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. వసతిగృహం శిథిలావస్థకు చేరిందన్నారు. షబ్బీర్‌అలీ స్పందించి హాస్టల్‌ను తనిఖీ చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేసామన్నారు.